క్లుప్తంగా

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



ధర్మపురిలో క్షీరాభిషేకం చేస్తున్న మైనార్టీలు

ధర్మపురి: మైనార్టీలకు రూ.లక్ష సాయం అందిస్తామని సీఎం ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్రపటాలకు ధర్మపురి అంబేడ్కర్ విగ్రహం వద్ద క్షీరాభిషేకం చేశారు. చర్చీల మరమ్మతుల కోసం రూ.96 లక్షలు మంజూరు చేసిన సీఎం, మంత్రి కొప్పులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి యోనా, ఉపాధ్యక్షుడు సుధాకర్, సంయుక్త కార్యదర్శి డేవిడ్, శాంతకుమార్ తదితరులున్నారు.

ఒకే పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు



పోలింగ్‌కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

సారంగాపూర్: మండలంలోని రెండు పోలింగ్ కేంద్రాలను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో నర్సింహామూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని పెంబట్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. గతంలో గ్రామ పంచాయతీలో ఓ పోలింగ్ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రస్తుతం గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మిస్తున్నందునా.. పోలింగ్ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాల భవనంలోకి మార్చడానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్‌రావు, ఆర్‌ఐలు భాస్కర్‌రావు, కృష్ణ, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య– గంగాధర్ దంపతులను వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత బుధవారం పరామర్శించారు. సౌజన్య మామ బక్కయ్య వారంరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ చుక్క దేవరాజం, గట్ల మహేశ్, నాంపెల్లి లింబాద్రి, మేడిపెల్లి రాజారెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



వార్డు ప్రజలతో మాట్లాడుతున్న సంజయ్

కోరుట్ల: బీఆర్‌ఎస్ హయాంలోనే పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 28వ వార్డులో గడపగడపకు సంజయన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని డాక్టర్ సంజయ్ ప్రజలకు వివరించారు. వార్డులో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలున్నా తన దృష్టికి తేవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, వార్డు కౌన్సిలర్ బట్టు సునీల్,పాల్గొన్నారు.

పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేయాలని వినతి

జగిత్యాలరూరల్: జిల్లాలో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేయాలని బుధవారం జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతకు స్వీపర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్ట్‌టైం స్వీపర్ల జిల్లా అధ్యక్షుడు రాజీమహ్మద్, స్వీపర్లు పాల్గొన్నారు.

కూలిన కాలువలు

- చివరి ఆయకట్టుకు అందని నీళ్లు
- మరమ్మతులు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి
- వానాకాలం సాగు నీరందేది కష్టమే..



శిథిలమై ఉన్న కాలువలు



ఇబ్రహీంపట్నంలో కూలిపోయిన డిస్ట్రిబ్యూటరీ కాలువలు

ఇబ్రహీంపట్నం: ఉపకాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. ఇబ్రహీంపట్నం మండలంలోని కాకతీయ కాలువ నుంచి 21 నుంచి 25 డిస్ట్రిబ్యూటర్లతో పంటలకు సాగునీరందుతుంది. డిస్ట్రిబ్యూటర్ కాలువలు కూలిపోయి చివరికి నీరందడం లేదు. ఉప కాలువలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగుకు నీరు అందించాలని రైతులు ఎన్నోసార్లు కోరినప్పటికీ నిధులు మంజూరు కాక మరమ్మతులకు నోచుకోవడం లేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండిన తర్వాత కాకతీయ కాలువకు, వాటి నుంచి ఉపకాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. నీటిని విడుదల చేస్తే చివరి ఆయకట్టుకు సాగు నీరు అందుతుంతో లేదో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ కాలువల్లో చెత్తాచెదారం పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో వాటిని తొలగించకపోవడంతో చివరి పంటలకు నీరు అందే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపకాలువలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగుకు నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఉపకాలువ నుంచి వందలాది ఎకరాలకు సాగుకు నీరు

మండలంలో 21 నుంచి 25 వరకు డిస్ట్రిబ్యూటర్ల ద్వారా వందలాది ఎకరాలకు సాగు నీరు అందుతుంది. డిస్ట్రిబ్యూటర్ 21, 22లలో 34.76 ఎకరాలు, డిస్ట్రిబ్యూటర్ 24, 25లలో 3844 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ డిస్ట్రిబ్యూటర్ కాలువలు అక్కడక్కడ కూలిపోయి సాగునీరు అందడం లేదు.

కాలువలను పూడ్చి వేస్తున్న రైతులు

కాకతీయ కాలువ డిస్ట్రిబ్యూటర్ల నుంచి పంటపొలాలకు వెళ్లే కాలువలను అక్కడక్కడ రైతులు పూడ్చి వేసి కబ్జా చేసి ఆయకట్టుకు నీళ్లు రాకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులకు రూ.1.29 కోట్లు

ఉపకాలువల మరమ్మతులకు రూ.1 కోటి 29 లక్షలతో మరమ్మతులు చేపట్టేందుకు గాను ఎస్సారెస్పీ అధికారులు అంచనా వేసి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు తయారు చేశారు.

నిధులు మంజూరు చేయాలి



ఉపకాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి. ఎన్నో ఏళ్లుగా ఉప కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కాలువలు కూలిపోయి నీళ్లు వృథాగా పోతున్నాయి. దీంతో రైతులకు సాగునీరు అందడం లేదు. అధికారులు వెంటనే స్పందించాలి.

– ఎడిపెల్లి మురళి, డిస్ట్రిబ్యూటరీ 24, మాజీ వైస్ చైర్మన్

ఆయకట్టుకు నీరందించాలి



డీ24 డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీళ్లు అందడం లేదు. ఈ కాలువ అక్కడక్కడ కూలిపోయింది. వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు చివరి ఆయకట్టు వరకు 2 పంటలకు నీళ్లు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– కటకం చిన్న నర్సయ్య, రైతు, వేములకుర్తి

మరమ్మతులు చేపడతాం



డిస్ట్రిబ్యూటర్ కాలువల మరమ్మతులు చేపట్టేందుకు రూ. 1 కోటి 29 లక్షలతో అంచనాలను తయారు చేస్తున్నాం. నిధుల మంజూరు కోసంపై అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడుతాం. పంట కాలువలను పూడ్చి వేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, ఎస్సారెస్పీ, ఈఈ, మెట్‌పల్లి

నిండుకుండలా చెరువులు.. కుంటలు



ఏడుమోటలపల్లిలో నీటి మునిగిన పంట పొలాలు



పూర్తిగా నిండిన పొరండ్ల ఊర చెరువు

జగిత్యాలరూరల్: భారీ వర్షానికి జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల ఊర చెరువు పూర్తిస్థాయిలో నిండి ఎగువ ప్రాంతాల్లో ఉన్న పొలాలు నీటమునిగాయి. ఊర చెరువుకు మత్తడి లేకపోవడంతో తూము ద్వారానే గ్రామపంచాయతీ పాలకవర్గం, గంగపుత్రులు రెండు రోజులుగా శ్రమించి నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో ప్రమాదకరస్థాయికి నీటిమట్టం చేరుకుంది.

జగిత్యాల: వర్షాలు విస్తృతంగా కురియడంతో చెరువులన్నీ పొంగిపొర్లుతున్నాయి. బైపాస్‌రోడ్ సమీపంలోని మోతె చెరువు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో చూపరులను ఆకట్టుకుంటోంది. సాయంత్రం వేలలో సేదతీరేందుకు ప్రజలు వెళ్తున్నారు.

పెగడపల్లి:మండలంలో వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వరద తాకిడికి పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మొక్కజొన్న చేళ్లలో నీరు నిలిచి ఎర్ర బారుతున్నాయని రైతులు పేర్కొన్నారు.

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణలో వయస్సు నిర్ధారణ కిరికిరీ

కథలాపూర్: గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్‌ఏ)ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించగా.. పలువురి వీఆర్‌ఏల వయస్సు నిర్ధారణ విషయంలో గందరగోళం నెలకొందని పలువురు వాపోతున్నారు. కథలాపూర్ మండలంలో 59 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నట్లు రికార్డుల్లో ఉంది. ఇందులో 56 మంది మాత్రమే ఇప్పటివరకు విధులు నిర్వహిస్తుండగా.. ముగ్గురు వీఆర్‌ఏలు సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. 56 మంది వీఆర్‌ఏలల్లో ఒక్కరు మృతి చెందగా, 55 మంది మాత్రమే విధుల్లో ఉన్నట్లు ఉన్నతాధికారులకు ఇటీవలే నివేదించారు. మరోవైపు 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏలు 10 మంది ఉండగా.. వీరి వారసులకు ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. ఇదంతా బాగానే ఉన్న పలువురి వీఆర్‌ఏల శాఖపరమైన రికార్డుల్లో వయస్సు ఎక్కువగా, ఆధార్‌కార్డులో తక్కువగా నమోదై ఉంది. 61 ఏళ్ల పైబడినవారి విషయంలో వయస్సు నిర్ధారణకు ఏదీ పరిగణిస్తారనే సందేహాలు నెలకొన్నాయి. వయస్సు నమోదులో తేడా ఉన్న వీఆర్‌ఏలు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సమస్యను విన్నవించుకున్నారు. కాగా సర్వీస్ రికార్డుల్లో నమోదైన వయస్సును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని డెప్యూటీ తహసీల్దార్ గీతాంజలి పేర్కొన్నారు.

కార్గిల్ అమరులకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని కార్గిల్ చౌరస్తావద్ద బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవానులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్, బీజేవైయం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్, బీజేపి పట్టణ అధ్యక్షుడు టీవీ. శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి తిరుమల వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ చౌరస్తా వద్ద కార్గిల్ దివస్ నిర్వహించారు. జవానులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు గుజ్జేటి శ్రీకాంత్, లయన్స్ క్లబ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సైనికులకు సన్మానం

వెల్గటూర్: కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని మండల కేంద్రానికి చెందిన మేకల వంశీ, పాశిగామ గ్రామానికి చెందిన కొట్టె మధూకర్ అనే సైనికులను వెల్గటూర్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైనికులను సన్మానించారు. దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సిరిపురం తిరుపతి, నరేందుల మోహన్, గట్ల రాజేందర్, బస్వరాజుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

జగిత్యాలరూరల్: రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో ఈవీఎం, వీవీపాట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎంలో ఎలా ఓటు వేయాలో వివరించి, వేసిన ఓటు వీవీపాట్‌లో కన్పిస్తుందనే విషయాన్ని మున్సిపల్ సిబ్బందికి, ఆర్పీలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ సంతోష్‌కుమార్, వైస్‌చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు కాంతారావు, శ్రీధర్, సాయి, మహేందర్ పాల్గొన్నారు.

నేడు పెగడపల్లిలో మంత్రి ఈశ్వర్ పర్యటన

పెగడపల్లి:మండలంలోని నామాపూర్, నందగిరి, రాజరాంపల్లి, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల్లో గురువారం మంత్రి ఈశ్వర్ పర్యటించనున్నట్లు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి తెలిపారు. మంత్రి పర్యటన విజయవంతం చేయాలనికోరారు.

బ్రిడ్జి వద్ద కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలరూరల్: రాయికల్ నుంచి రామాజీపేటకు వెళ్లే రోడ్డులో కొత్త వంతెన నిర్మాణం వద్ద తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి తాత్కాలిక రహదారి కొట్టుకుపోయి ఆ ప్రాంతమంతా బురదమయమైంది. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేయడంతో పాటు, రాకపోకల కోసం తాత్కాలిక రహదారికి మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు ఇద్దం సుదీర్, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, జిల్లా జనరల్ సెక్రటరీ మహిపాల్ రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ షాకీర్, మంద రమేశ్, మున్న, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలి'

మల్లాపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్‌ల ప్రభుత్వాల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సుప్రీంకోర్టు అడ్వకేట్ కొమొరెడ్డి కరం అన్నారు. మల్లాపూర్‌లో గడ్డం హన్మాంత్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సురభి అశోక్, నాయకులు తోట సంతోష్, నల్ల ఏకాంబర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

మల్లాపూర్: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారం, హత్య ఘటనకు కారకులైన వారిని బహిరంగంగా ఉరితీయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది ఎర్ర రమేశ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ అంబేద్కర్ కూడలి వద్ద యువజన సంఘ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చగా మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బబ్బురి రాజేందర్, పాతకాల కిరణ్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, ఎం అశోక్, నరేశ్, రాజు, పాల్గొన్నారు.

కేజీవీల్స్ ట్రాక్టర్లతో రోడ్డుపైకి రావొద్దు



ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన రైతు

ఇబ్రహీంపట్నం: సొంత ఖర్చులతో ఫౌల్ట్రీ ఫారానికి వెళ్లే రోడ్డు వేయించానని, రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్లతో రావొద్దని ఓ రైతు రోడ్డు వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలోని కంతి రమేశ్ అనే రైతు వర్షకొండ శివారులోని తన ఫౌల్ట్రీ ఫారానికి వెళ్లేందుకు రూ. 25వేలు ఖర్చు చేసి రోడ్డు బాగు చేయించాడు. క్రేజీవీల్స్ ట్రాక్టర్లు ఈ దారిలో వెళ్తే రోడ్డు పాడవుతుందని, రైతులు అర్థం చేసుకుని క్రేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపించొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరసన





జగిత్యాలలో చెవిలో పువ్వులతో, మెట్‌పల్లిలో కళ్ల కు గంతలు కట్టుకుని జీపీ కార్మికుల నిరసన

జగిత్యాలరూరల్/ మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/వెల్గటూర్/కథలాపూర్ మెట్‌పల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు, కారోబార్లు చేస్తున్న సమ్మె 21వ రోజుకు చేరింది. బుధవారం రాయికల్‌లో చెవిలో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మల్లాపూర్‌లో గేదెకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. వెల్గటూర్‌లో ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి చౌరస్తా వద్ద బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. మెట్‌పల్లిలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. పెగడపల్లిలో పంచాయతీ కార్మికులకు పద్మశాలీ నాయకులు మద్దతు తెలిపారు. నేడు కలెక్టరేట్ వద్ద నిరసన తెల్పనున్నట్లు కథలా పూర్‌లో నాయకులు తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలి



ఇటిక్యాలలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: రైతులు పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలని రాయికల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఇటిక్యాలలో పండ్లతోటల పెంపకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటల పెంపకంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో దివ్య, ఉపసర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రైతులు పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తిలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరిమొక్కజొన్న సాగుతో పాటు, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి ఆదాయం పెంపొందించేలా పండ్లతోటలు సాగుచేయాలన్నారు. పండ్లతోటల పెంపకానికి ఉపాధి హామీలో చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర ప్రవీణ్, ఏఈవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'బోగస్ బిల్లులతో దోపిడీ'

జగిత్యాలటౌన్: గతంలో పనిచేసిన కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు తిరస్కరించిన బిల్లులను కౌన్సిల్ ఆమోదం పొందించి ప్రజాధనం దోపిడీ చేసేందుకు అధికార పార్టీ కౌన్సిలర్లు, అధికారులు కుట్ర చేస్తున్నారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రజాధనం దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని జగిత్యాల బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య కోరారు. బుధవారం బల్దియా సాధారణ సమావేశం అనంతరం మాట్లాడారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్లు తిరస్కరించి, బోగస్ బిల్లులుగా తేల్చిన వాటినే తిరిగి ఈ సమావేశం ఏజెండాలో పొందుపరిచి ప్రజాధనం కాజేయడానికి కుట్రలు పన్నారని ఆరోపించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి భరించలేక పలువురు కమిషనర్లు బదిలీ చేయించుకుని లేదా లాంగ్‌లీవ్‌లో వెళ్లిపోయారని అన్నారు. బల్దియాలో జరుగుతున్న అవినీతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'కమీషన్ల కోసం ప్రజాధనం వృథా'

జగిత్యాలటౌన్: గతంలో తిరస్కరణకు గురైన బిల్లులనే తిరిగి కౌన్సిల్‌లో ప్రతిపాదించి ప్రజాధనం కాజేసే కుట్ర జరుగుతుందని బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి ఆరోపించారు. హరితహారం సహా పలు బిల్లులు పేమెంట్ కోసం పెట్టగా అప్పటి కమిషనర్లు తిరస్కరించగా, వాటినే కౌన్సిల్ ఆమోదం కోసం పెట్టారని విమర్శించారు. బోగస్ బిల్లుల మంజూరుకు తెరలేపి అధికార పార్టీ కౌన్సిలర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కృష్ణహరి జిల్లా కలెక్టర్‌ను కోరారు.

సంక్షిప్త వార్తలు

సంకల్పయాత్రకు ఉద్యోగుల స్వాగతం

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల మీదుగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పింఛన్ విధానం సాధన సంకల్పయాత్ర నిర్వహిస్తుండగా బుధవారం జగిత్యాల జిల్లాకు చేరుకోగా కలెక్టరేట్ వద్ద టీఎస్‌సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు గంగుల సంతోష్‌కుమార్, కందుకూరి రవిబాబు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

జగిత్యాలక్రైం: మొబైల్ పోగొట్టుకున్న ఏడుగురు బాధితులకు కొత్త టెక్నాలజీ సహాయంతో పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకుని ఎస్సై అజయ్ బాధితులకు బుధవారం రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీసు పోర్టల్ ద్వారా గానీ, స్వయంగా పోలీస్‌స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేస్తే ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగిస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలక్రైం: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్సై రహీం అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్, బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు, డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అమ్మాయిలను వేధిస్తే షీటీం పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 87126 70783 నంబరుకు, డయల్ 100 కు కాల్ చేయాలన్నారు. ఏఎస్సై అలీబేగ్, మహిళ కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పనులపై నిర్లక్ష్యం వద్దు

కథలాపూర్: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని కోరుట్ల డీఎల్పీవో శంకర్ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని సిరికొండ, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికికాలువల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశముంటుందని, వాడల్లో దోమల నివారణకు మందులు స్ప్రే చేయించాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట సర్పంచులు కూన సులోచన, గాండ్ల వీణ, కార్యదర్శులు నర్సారెడ్డి, ఎం.డీ గఫూర్, అంబల్ల అశోక్ ఉన్నారు.

మోదీ సంక్షేమ పథకాలతో రైతులకు లాభం

ధర్మపురి: ప్రధాన మంత్రి మోదీ ప్రవేశపెడుతున్న పథకాలతో రైతులకు లాభాలు వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారని బీజేపీ నాయకులు అన్నారు. నేడు దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న 14వ, విడత కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ప్రధాన మంత్రి మోదీ 8 కోట్ల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. సల్ఫర్ పూతతో ఏర్పాటు చేసిన యూరియాను దేశంలోని 1. 25 కోట్ల మంది రైతులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండారి లక్ష్మణ్, పిల్లి శ్రీనివాస్, నలుమాసు వైకుంఠం, అప్పం శ్రీనివాస్, గాజు భాస్కర్ తదితరులున్నారు.

యూవిన్ యాప్‌లో నమోదుపై అవగాహన

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల మండలాలకు చెందిన వైద్య సిబ్బందికి వ్యాధినిరోధక టీకాలు, పిల్లలకు ఇచ్చే వ్యాక్సినేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యూ.డబ్ల్యూఐఎన్ యాప్‌లో వ్యాక్సినేషన్, గర్భవతులు, పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్లు, బూస్టర్ డోసుల వివరాలు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐవో శ్రీనివాస్, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సమియోద్దీన్, డాక్టర్ అంజిరెడ్డి, వేణు, డాక్టర్లు మౌనిక,నరేశ్, రమ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

జగిత్యాలటౌన్: పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన విశ్వనాళ్ల సంతోష్ ఇటీవల గుండె పోటుతో చనిపోగా, సత్యసాయి సేవాసమితి రూ.42,000 ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. బుధవారం సంతోష్ కుటుంబ సభ్యులను కలిసి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్, లక్ష్మీనారాయణ, కోటగిరి మహేందర్, అర్వపెల్లి ఆనంద్, పాల్గొన్నారు.